విశాలాంధ్ర విజయనగరం
సోమవారం 20, జనవరి 2025

ఆకట్టుకున్న సైబర్ మోసాల లఘు చిత్రం

విశాలాంధ్ర-భోగాపురం: మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన యువకులు సైబర్ మోసాలపై తీసిన లఘు చిత్రం ఆకట్టుకుందని సిఐ ఎస్ వి ప్రభాకర్ అన్నారు. ఈ లఘు చిత్రాన్ని పోలీస్ స్టేషన్లో సిఐ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరస్తులు ప్రజలను మోసం చేసి డబ్బును దోచుకుంటున్నారని అన్నారు. మొబైల్ ఫోన్లో అపరిచిత వ్యక్తులు పంపించే లింకులు పై క్లిక్ చేయవద్దని సూచించారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు చెప్పమన్నా లేదా బ్యాంకు వివరాలు అడిగిన చెప్పరాదని అన్నారు. లఘు చిత్రాన్ని నిర్మించిన యువకులు రాజు లక్కీ, శ్రావణ్ కుమార్, వెంకటేష్, ప్రసాద్, మహేష్, రాజులను సీఐ అభినందించారు. ఇలాంటి చిత్రాల ద్వారా సమాజంలో కొంత మార్పు వస్తుందని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సూర్య కుమారి, లింగాలవలస యువకులు పాల్గొన్నారు.

మీ ఇల్లే విద్యుత్ ఉత్పత్తి కేంద్రం...

- పిఎం సూర్యఘర్ పథకంతో బిల్లులకు చెక్
- అదనపు ఆదాయానికి మార్గం

విశాలాంధ్ర-విజయనగరం : విద్యుత్ బిల్లులనుంచి విముక్తి పొందడానికి చక్కని పరిష్కారం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం. పైగా ఈ పథకం ద్వారా అదనపు ఆదాయం కూడా పొందే అవకాశం లభిస్తుంది. మీ ఇల్లే ఒక విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారుతుంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో ఇప్పుడు సోలార్ రూఫ్‌టాప్ పథకం సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చింది.

ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానళ్లు

ప్రతి నెలా పెరిగిపోతున్న విద్యుత్తు బిల్లుల సమస్యకు పరిష్కారం చూపించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక అద్భుతమైన పథకాన్ని తీసుకొచ్చింది. ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుని ఉచిత కరెంటు పొందవచ్చు. జీవితాంతం ఉచిత విద్యుత్తు పొందడమే కాదు మిగులు విద్యుత్తును విక్రయించి ఆదాయమూ పొందవచ్చు. అదే ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన. దేశ వ్యాప్తంగా కోటి కుటుంబాలకు సోలార్ విద్యుత్తు ఏర్పాటుకు సబ్సిడీ ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఒక్కో ఇంటిపై గరిష్ఠంగా 3 కిలోవాట్ల వరకు ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల చొప్పున సబ్సిడీని అందిస్తోంది.

ప్రతీఒక్కరూ వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం సామాన్యులకు ఒక వరం. ఇళ్లపై సౌర ఫలకాలను ఏర్పాటుచేసుకొని విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చు. మీ ఇంటికి అవసరమైన విద్యుత్‌ను ఇంటిపైనే ఉచితంగా ఉత్పత్తి చేయొచ్చు. సుదీర్ఘకాలం సూర్యఫలకాలు పనిచేస్తాయి. మీరు పెట్టిన పెట్టుబడి ఐదేళ్లకే తిరిగి వస్తుంది. జిల్లాలోని సుమారు 50వేల ఎస్సి, ఎస్‌టి ఇళ్లకు ఈ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించారు. మిగిలిన వారు కూడా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని తమ ఇళ్లపైన లేదా ఖాళీ స్థలాల్లో సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నాం.

సబ్సిడీ పొందండి ఇలా...

పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఒక్కో కిలోవాట్‌కు కేంద్రప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తుంది. రెండు కిలో వాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు అయితే మరో రూ.18 వేలు సబ్సిడీ అందిస్తుంది. అంటే ఇంటిపై 3 కిలోవాట్ల సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుంటే రూ.1.45 లక్షలు ఖర్చవుతుంది. దీనిపై కేంద్రం రూ.78 వేలు రాయితీ అందిస్తుంది. మిగితా సొమ్మును ఎలాంటి గ్యారంటీ లేకుండానే బ్యాంకు ద్వారా రుణం తీసుకోవచ్చు.

విద్యుత్ బిల్లుకు ఆదా

నెలకు 0-150 యూనిట్ల వరకు కరెంట్ వాడుకునే వారికి కేవలం 100 చదరపు అడుగుల విస్తీర్ణంలోనే, 1-2 కిలోవాట్ల సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవొచ్చు. 150-300 యూనిట్ల వరకు అయితే 2-3 కిలోవాట్ల ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవచ్చు. ఆపైన సైతం ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే సబ్సిడీ మాత్రం

గరిష్ఠంగా రూ.78 వేలు మాత్రమే వస్తుంది. ఈ స్కీమ్ ద్వారా వచ్చే విద్యుత్తును మీ అవసరం మేరకు వాడుకుని, మిగిలిన కరెంటును నెట్ మీటరింగ్ ద్వారా ఇతరులకు విక్రయించుకోవచ్చు. ఎపి ట్రాన్స్‌కోకు విక్రయించే ప్రతీ యూనిట్‌కు ప్రభుత్వం రూ.2.50 పైసలు చెల్లిస్తుంది.

ఏడాదికి రూ.30వేలు ఆదా

సూర్య ఘర్ అధికారిక వెబ్‌సైట్లో పేర్కొన్న వివరాల ప్రకారం 1 కిలోవాట్‌కు 120 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుత రేట్ల ప్రకారం నెలకు రూ.1000 బిల్లు వస్తుంది. సోలార్ ప్యానళ్ల ఖర్చు రూ.338 మాత్రమే. అంటే ఏడాదికి రూ. 8 వేలు ఆదాయ అవుతుంది. 240 యూనిట్లు వినియోగించే వారికి నెలకు రూ.2 వేలు బిల్లు వస్తుంది. సోలార్ వ్యవస్థ ద్వారా రూ.333 ఖర్చవుతుంది. 360 యూనిట్లు వినియోగించే వారికి అయితే ఏడాదికి రూ.32 వేలు ఆదా అవుతాయి.

దరఖాస్తు విధానం ఇలా...

పీఎం సూర్య ఘర్ పోర్టల్ pmsuryaghar.gov.inలో ముందుగా రిజిస్టర్ చేసుకోవాలి. మీ రాష్ట్రం, విద్యుత్తు సరఫరా కంపెనీ ఎంపిక చేసుకోవాలి. విద్యుత్ కనెక్షన్ నంబర్, ఫోన్ నంబర్, ఇ-మెయిల్ ఐడీ ఇవ్వాలి. ఆ తర్వాత మీ విద్యుత్తు కన్స్యూమర్ నంబర్, ఫోన్ నంబర్‌తో లాగిన్ కావాలి. రూఫ్ టాప్ సోలార్ కోసం అప్లయ్ చేయాలి. ఫారం ఫిల్ చేసి డిస్కమ్ నుంచి అనుమతులు వచ్చే వరకు వేచి ఉండాలి. అనుమతులు వచ్చిన తర్వాత డిస్కమ్ గుర్తింపు పొందిన విక్రేతల నుంచి సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలి. ఆ తర్వాత వివరాలను పోర్టల్‌లో సమర్పించి నెట్ మీటర్ కోసం దరఖాస్తు చేయాలి. నెట్ మీటర్ ఇన్‌స్టాల్ చేశాక డిస్కమ్ అధికారులు తనిఖీ చేస్తారు. ఆ తర్వాత కమిషనింగ్ సర్టిఫికెట్ ఇస్తారు. ఈ రిపోర్ట్ వచ్చాక మీ బ్యాంకు ఖాతా వివరాలతో క్యాన్సిల్ చేసిన చెక్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలి. 30 రోజుల్లో సబ్సిడీ వస్తుంది.

అంబేద్కర్ ని కించపరిచిన అమిత్‌షా గోబ్యాక్ ...

వామపక్షాల నిరసన ప్రదర్శన

విశాలాంధ్ర-నెల్లిమర్ల: అంబేద్కర్ ని కించపరిచిన కేంద్ర మంత్రి అమిత్ షా గో బ్యాక్ అంటూ వామ పక్షాలు నిరసన వ్యక్తం చేసాయి. ఆదివారం స్థానిక మొయిద జంక్షన్ లో సిపిఐ, సిపిఎం, న్యూ డెమోక్రసీ, ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి రాష్ట్ర పర్యటన వ్యతిరేకిస్తూ అమిత్ షా గో బ్యాక్ అంటూ నిరసన వ్యక్తం చేసాయి. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మొయిద పాపారావు, సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు, న్యూ డెమోక్రసీ నాయకులు కాళ్ళ అప్పల సూరి,కాంగ్రెస్ నాయకులు కనకల పద్మ నాభం మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ని అవమాన పర్చిన కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదన్నారు.ముఖ్యంగా విభజన చేసిన ఆంధ్రప్రదేశ్ లో ప్రత్యేక హెూదా, విభజన చట్టం లోని హామీలు అమలు చేయలేదు సరికదా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పాల్పడే విధంగా గనులు కేటాయించకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బిజెపి, అమిత్ షా రాష్ట్రంలో తిరిగే హక్కు లేదని వెనక్కు వెళ్లాలని డిమాండ్ చేశారు.అంతే కాకుండా రాజ్యాంగం నిర్మాత అంబేద్కర్ ని అవమానపర్చి, రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా కి కూటమి నాయకులు వత్తాసు పలకడం భావ్యం కాదన్నారు. కాబట్టి అమిత్ షా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి, విభజన హామీలు అమలు, ప్రత్యేక హెూదా, విశాఖ స్టీల్ ప్లాంట్ కి స్వంత గనులు కేటాయించి స్టీల్ ఆథారిటీ ఆఫ్ ఇండియా లో కలపి పరిరక్షంచాలని డిమాండ్ చేశారు. అలాకాని పక్షంలో మరింత ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు కనకల రాము, సుంకర అప్పారావు, జగ్గిన్ని సత్యారావు, ఎం. అప్పన్న, సిపిఐ నాయకులు పి. సూరి, తదితరులు పాల్గొన్నారు.

తోటకల్లాలకు రోడ్డు నిర్మించాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన సోంపురం గ్రామస్తులు

విశాలాంధ్ర-వేపాడ/లక్కవరపుకోట: మండలంలోని సోంపురం గ్రామానికి చెందిన తోటకల్లాలకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారికి గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఆదివారం లక్కవరపుకోటలో గల తన క్యాంపుకార్యాలయంలో ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారిని మర్యాదపూర్వకంగాకలిశారు. ఈ సందర్భంగా సోంపురం తెలుగుదేశంపార్టీ నాయకులు గ్రామస్థులు కలసి గ్రామానికి చెందిన ఆర్ అండ్ బి రోడ్డు నుంచి తోటకల్లాల వరకు సుమారు1.4 కి.మీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకి విన్నవించారు.సోంపురం గ్రామస్తుల వినతిపై స్పందించిన ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి ఆర్అండ్.బి డీఈని రోడ్డు విషయమై ఆదేశించిగా గ్రామ సభ తీర్మానం ద్వారా ఉపాధి హామీ నిధులతో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.అలాగే తక్షణమే రోడ్డు నిర్మాణానికి తగు నిధుల వ్యయాన్ని అంచనా వెయ్యాలని డీఈని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి మాట్లాడుతూ సోంపురం గ్రామ అభివృద్ధికి తన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి రోడ్డు నిర్మాణానికి తీసుకున్న చొరవ పట్ల సోంపురం గ్రామస్థులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జ్ నెక్కల సత్యనారాయణ,మళ్ల రమణ,నీటీ సంఘం అధ్యక్షులు జాగరపు రాము,గొర్రిపోటు నల్లబాబు,గొర్రిపోటు శేఖర్,చల్ల నాయడు,గొర్రిపోటు ప్రసాద్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఊపందుకున్న పల్లె పండుగ

ఎన్.కె.ఆర్. పురంలో చురుగ్గా సిసి రోడ్డు నిర్మాణ పనులు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలో పల్లె పండుగ ఊపందుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లు రాష్ట్ర అభివృద్ధిపై చూపిస్తున్న పనుల నిమిత్తం పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో రహదారులు సిసి రోడ్లు డ్రైనేజీ పనులుపై టిడిపి తమ్ముళ్లు దృష్టి సారించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.ఈ మేరకు మండలంలోని నీలకంఠ రాజపురం గ్రామంలో టిడిపి నాయకులు, మాజీ ఎంపీటీసీ వేచలపు జగ్గీబాబు ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జాతీయ గ్రామీణ అభివృద్ధి ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీలో రూ. 2.50 లక్షలు, అలాగే ఎస్టి కాలనీలో రూ.2.50 లక్షలు నిధులతో నిర్మిస్తున్న ఈ సి.సి.రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి.ఈ మేరకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెరకముడిదాం మండలంలో పశు ఆరోగ్య శిబిరాలు

డాక్టర్ సిహెచ్ హైమావతి

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో అన్ని గ్రామాల్లో పశువుల ఆరోగ్యాన్ని, ఉత్పాదకతను పెంచడానికి వ్యాధులను నియంత్రించడానికి, పశు పోషణ ఖర్చులు తగ్గించడానికి ఆర్థిక అండను కలగచేయడానికి పశుసంవర్ధక సేవలను పశుపోషకులకు మరింత దగ్గర చేయటానికి గాను తేది: 20.01.2025 నుంచి తేది : 31.01.2025 వరకు అన్ని గ్రామలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని మండల పశు వైద్యధికారిణి డాక్టర్ సిహెచ్ హైమావతి తెలియజేసారు.ఈ యొక్క పశు ఆరోగ్య శిబిరాల్లో పశువులకు, దూడలకు మరియు సన్న జీవాలకు నట్టల మందులు ఉచితంగా త్రాగించటం,ఎదకు వచ్చిన పశువులకు ఎద ఇంజెక్షన్ చేయటం,చూడి పరీక్షలు నిర్వహించటం,ఎదకు రాని, చూలు కట్టని మరియు గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగు వైద్యం అందించటం,పశువులు,సన్నజీవాలకు మరియు కోళ్లల్లో ఉచితంగా టీకాలు వేయటం, పశుపోషకులకు పశు పోషణలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించటం మరియు ప్రస్తుతం అమలు అవుతున్న మినీ గోకులం, బహువార్షిక పశుగ్రాసాల సాగు,పశు కిసాన్ క్రెడిట్ కార్డ్స్ మరియు లింగ నిర్ధారిత వీర్యం గురించి తెలియపరచటం వంటివి జరుగుతుంది. కావున పశు పోషకులు అందరూ మీ యొక్క గ్రామాలల్లో పశు ఆరోగ్య శిబిరాలు జరిగినప్పుడు అందరూ వినియోగించుకోవాలని మండల పశు వైద్యధికారిణి డాక్టర్ సిహెచ్ హైమావతి సూచించారు.

శిథిలావస్థలో తాసిల్దార్ కార్యాలయం

భయోందోళనలో ఉద్యోగులు...

విశాలాంధ్ర-చీపురుపల్లి: ఎడతెరిపి లేని వర్షాలు కారణంగా శిథిలావస్థకు చేరుకున్న చీపురుపల్లి తాసిల్దార్ కార్యాలయం ఏ క్షణాన కూలి ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలో తాసిల్దార్ తో పాటు మిగిలిన ఉద్యోగులు కూడా ప్రాణాలను అరచేత పట్టుకుని బిక్కుబిక్కు బంటు ఉద్యోగాలను చేస్తున్నారు. వర్షాలు కారణంగా ఎక్కడైనా ఇల్లు కూలిన భవనాలు కూలిన ఎటువంటి ప్రకృతి వైపరీత్యా ప్రమాదాలు జరిగిన అంచనాలు జరిపి ఉన్నత అధికారులకు నివేదికలు పంపవలసిన చీపురుపల్లి తాసిల్దార్ కార్యాలయమే శిథిలావస్థకు చేరుకుని ఏ క్షణంలో కూలుతుందో తెలియక కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. చీపురుపల్లి పట్టణ ప్రధాన కేంద్రంలో బ్రిటిష్ కాలమునాటి పాత కోర్టు భవనమునకు ఆనుకుని నిర్మించిన తాసిల్దార్ కార్యాలయం శిథిలవాస్తకు చేరుకుంది. ప్రత్యేకించి తాసిల్దార్ కూర్చున్న చాంబర్ మొత్తం స్లాబ్ పెచ్చు లూడి పోయి కూలిపోవడానికి సిద్ధంగా ఉండడంతో చాంబర్లో కూర్చుని విధులు నిర్వహించడానికి తాసిల్దారు సైతం భయాందోళన చెందుతున్నారు. అంతేకాక తాసిల్దార్ కార్యాలయంలో మండలానికి సంబంధించిన రెవిన్యూ రికార్డుల గది కూడా చెదలు పట్టి వర్షాల కారణంగా రికార్డులు మొత్తం తడిసిపోవడంతో చీపురుపల్లి కి సంబంధించిన భూ రికార్డులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందంటూ పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కార్యాలయంలో కంప్యూటర్ విభాగానికి సంబంధించిన గది కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు సైతం బిక్కుబిక్కుమంటు విధులు నిర్వహిస్తున్నారు. వర్షాలకు స్లాబ్ పెచ్చులు ఊడిపోవడంతో పాటు, కంప్యూటర్ల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ కూడా చెదలు పట్టి పాడైపోవడంతో ఈ విధంగా విధులు నిర్వహించాలంటూ ఉద్యోగులు వాపోతున్నారు. గత ప్రభుత్వ పాలనలోనే చీపురుపల్లి తాసిల్దార్ కార్యాలయం నూతన భవన నిర్మాణం కొరకు నిధులు మంజూరైనప్పటికీ నేటి వరకు పనులు ప్రారంభం కాకపోవడం పట్ల ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూతన భవన నిర్మాణం కొరకు సుమారు 90లక్షలు నిధులు మంజూరైనట్లు గతంలో పాలకులు అధికారులు ప్రకటించినప్పటికీ పనులు ప్రారంభించడం లేదంటూ పలువురు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వ పాలకులైన శిథిలా వస్తువు చేరుకున్న తాసిల్దార్ కార్యాలయం పైన దృష్టిసారించి నూతన భవన నిర్మాణం కొరకు చర్యలు చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.

డిప్యూటీ సీఎం పదవికి లోకేష్ అర్హుడు

మాజీ ఎమ్మెల్యే గద్ద బాబురావు

విశాలాంధ్ర-చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం పదవికి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ అన్ని విధాలుగా అర్హుడు, సమర్థుడని చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు అన్నారు. ఆదివారం అయినా తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఐదు కోట్ల జనాభాలో కోటి సభ్యత్వాలు చేయించిన ఘనత ఒక నారా లోకేష్ కే దక్కింది అన్నారు. ఐదు కోట్లకు గాను కోటి మందితో సభ్యత్వం చేయించి తన సత్తా చూపించారని ఆయన లోకేష్ పనితనాన్ని కొనియాడారు... రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ స్థాపించిన నందమూరి తారక రామా రావు నాలుగుసార్లు ఆయన తరువాత తరం నారా చంద్రబాబు నాయుడు నాలుగుసార్లు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారని ఆయన అన్నారు. అదే విధంగా రాష్ట్రంలో రెండుసార్లు మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు నిర్వహించారని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో నారా లోకేష్ డిప్యూటీ సీఎం బాధ్యతలు స్వీకరించి తన సమర్థతను నిరూపించుకోవాల్సిన ఆవశ్యకతవచ్చింది అన్నారు. కడప జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి నారా లోకేష్ డిప్యూటీ సీఎం బాధ్యతలు తీసుకోవాలి అని చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తున్నట్లు గద్దె బాబురావు తెలిపారు.. నారా లోకేష్ చొరవ, ప్రోత్సాహంతో తన కుమారుడు గద్దె అనురాగ్ పార్టీ సభ్యత్వం కార్యక్ర మంలో చురుకుగా పాల్గొని సత్తా చూపించారని ఆయన అన్నారు. నారా లోకేష్ డిప్యూటీ సీఎం బాధ్యతలు తీసుకో వలసిన ఆవశ్యకత ప్రస్తుతం ఈ రాష్ట్ర ప్రజలకు ఎంతో ఆవశ్య అవసరమని ఆయన అన్నారు.. రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీ తరపున మూడవ తరం నాయకత్వం రాజ్య వేలుతోందని ఆయన జోష్యం పలికారు.

ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవ్...!

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మందుబాబులను హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టేందుకుగాను జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లుగా తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, న్యూసెన్సు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో పోలీసు యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా జనవరి 18న దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా లే-అవుట్లు, గ్రామ శివారు ప్రాంతాల్లోను, నగర శివారు ప్రాంతాల్లోను, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న 252 మంది మందుబాబులపై కేసులు నమోదు చేసారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ఆకస్మికంగా వాహన తనిఖీలను చేపట్టి, పశువులను, మద్యం అక్రమంగా తరలిస్తున్న వారిపై రెండు కేసులు నమోదు చేసి, ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి 8మద్యం బాటిళ్ళు, 4పశువులను, ఒక వ్యాను సీజ్ చేసారన్నారు. వాహన తనిఖీల్లో రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై 386 కేసులు నమోదుచేసి,రూ.95,205/-లను ఈ-చలానాగా విధించారన్నారు. అదే విధంగా సంతకవిటి పోలీసు స్టేషను పరిధిలో పేకాట ఆడుతున్న వారిపై రైడ్ చేసి, పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి బెట్టింగులకు వినియోగించినరూ. 16,080/- ల నగదు సీజ్ చేసారని తెలిపారు. వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై 29 కేసులు నమోదు చేసామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

ప్రమాదాల నివారణకై డ్రైవర్లకు అవగాహన

విశాలాంధ్ర-శృంగవరపు కోట: ఆర్టీసీ లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రహదారి భద్రతా మాసోత్సవాలు లో భాగంగా ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ డిపో లో ప్రమాదాల నివారణకు డ్రైవర్లు పాటించవలసిన జాగ్రత్తలపై డిపో మేనేజర్ రమేష్ అవగాహన కల్పించారు. ముఖ్యం గా డ్రైవర్లు డ్యూటీ లేని సమయంలో తగిన విశ్రాంతి తీసుకొని ఏకాగ్రత తో బస్సులు నడపాలని, మెకానిక్కులు బస్సు ను మంచి కండిషన్ లో ఉంచాలని తెలియజేశామన్నారు. ఈ ఉత్సవాలు లో ఈనెల 17 నుంచి 21 వరకు బస్సు కండిషన్ మెరుగుదల కార్యక్రమం లో బస్సు లకు వున్న మరమ్మత్తులు అన్నియు నమోదు చేసి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నట్లు తెలియచేసారు. అలాగే ప్రతి రోజు డిపో సిబ్బంది కి రహదారి భద్రత గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం డిపో మేనేజర్ ప్రమాదాల నివారణకు తీసుకో వలసిన జాగ్రత్తలు గురించి వివరించి భద్రత పై ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సుందరాడలో నాలుగు వరి కుప్పలు దగ్ధం

సుమారు రూ.4 లక్షలు ఆస్తి నష్టం

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో ఆదివారం సాయంత్రం సుందరాడ గ్రామంలో నాలుగు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. ఆస్తి నష్టం సుమారు నాలుగు లక్షల రూపాయలు ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా. అయితే గ్రామానికి చెందిన ముత్త. నాగేశ్వరరావు, ముత్త తిరుపతి, వేజేటి.లక్షుం , కుసుమూరు పెంటయ్య రైతులకు సంబంధించిన నాలుగు వరికుప్పలు సుమారు 180 బస్తాలు అయినా చేయను కాలి బూడిద అయిందని వారు తెలిపారు. రాజాం అ గ్ని వ మా వ క కేంద్రం మంట లను అతుకుల అ దు వు లో కి తెచ్చింది. సంఘటన స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించి తాసిల్దార్ కు నివేదిక ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు.

రాయితీ పై బిందు సేద్య పరికరాలు పొందండి

ఎపి ఎంఐపి పీడీ లక్ష్మీ నారాయణ

విశాలాంధ్ర-విజయనగరం: ఆంధ్ర ప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కింద అమలవుతున్న బిందు మరియు తుంపర్ల సేద్య పరికరాలను రాయితీపై పొందుటకు అర్హులైన నీటి సదుపాయం గల జిల్లాలోనే రైతాంగం ఆయా రైతు సేవా కేంద్రాల్లో ఆసక్తిగల రైతు సోదరులు ఏపీఎంఐపి ఆన్లైన్ పోర్టల్ లో త్వరితగతిన నమోదు చేసుకోవాలని జిల్లా పథక సంచాలకులు పి.ఎస్.వి. లక్ష్మీనారాయణ కోరారు. ఈ పథకానికి రాయితీ పొందడానికి రైతులకు బోరు లేదా బావి ఒంటి నీటి సదుపాయం ఉన్న వారు అర్హులు. ఐదు ఎకరాల లోపు ఉన్న చిన్న సన్నకారు రైతులకు 90% రాయితీపై గరిష్టంగా రెండు లక్షల పదివేల రూపాయలు డ్రిప్ ఇరిగేషన్ కి రాయితీ ఇవ్వబడునని తెలిపారు. 5 ఎకరాల నుండి 12:50 ఎకరాలు లోపు ఉన్న రైతులకు 50 శాతం పై బిందు సేద్యం పరికరాలు మంజూరు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పథకానికి కౌలు రైతులు కూడా అర్హులని తెలిపారు. ఏడు సంవత్సరాల క్రితం మంజూరు కాబడిన డ్రిప్ వేసుకున్న రైతులు కూడా మరల కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వము రైతులను ప్రోత్సహించే ఈ పథకాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. రైతులు పండిస్తున్న అన్ని రకాల పండ్లతోటలు కూరగాయలు పూల తోటలో ఆయిల్ కొబ్బరి తదితర పంటలకు డ్రిప్ ఇరిగేషన్ అనుకూలమని తెలిపారు.

బెల్ట్ షాపులుగా మారుతున్న కిరాణా షాపులు...!

- జోరుగా మద్యం విక్రయాలు
- పట్టించుకోని పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు



విశాలాంధ్ర-వేపాడ: సంక్రాంతి పండగ అనంతరం మండలంలో గల గ్రామాల్లో తీర్థ మహోత్సవాలను పురస్కరించుకొని గ్రామాల్లో వీధికొక బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గ్రామాల్లో కిరాణా,పాన్ షాపుల పేరుతో మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. పేరుకు కిరాణా షాపులు అక్కడ ఎక్కువగా విక్రయించేది మద్యమే... ఇలా బెల్ట్ షాపుల నిర్వహణకు అధికారుల అండదండలు మెండుగా ఉండడంతో మద్యం దుకాణం యజమానులే దీనికి ప్రోత్సహిస్తున్నట్లు బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో బహిరంగంగా బెల్ట్ షాపులు ద్వారా మద్యం అమ్మకాలకు అడ్డు అదుపు లేక పోవడంతో మందుబాబులు చిన్న పెద్ద అనే తేడా లేకుండా మద్యం పూటుగా సేవించి మైకంలో మునిగితేలుతున్నారు. కాగా కొన్ని గ్రామాల్లో గ్రామ పెద్దల చొరవతో గ్రామాల్లో మద్యం అమ్మకానికి పాట నిర్వహించి బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి.మద్యం పాట ఉన్న గ్రామాల్లో ప్రభుత్వ రేటుకు రూ.20 నుండి 30 రూపాయలు వరకు పెంచి పెద్దల ప్రోత్సహించిన బెల్టు షాపు ద్వారానేమద్యంవిక్రయిస్తున్నారు.ఈ మేరకు మండలంలోని దబ్బిరాజుపేటలో గ్రామంలో శనివారం జరిగిన ముత్యాలమ్మ తీర్థ మహెూ త్సవం సందర్భంగా గ్రామంలో రెండు బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు ఊపందుకోవడంతో మందు బాబులకు మద్యానికి కరువు లేకుండా పోయింది. తద్వారా మద్యం షాపు నిర్వాహకులకు మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం సాగింది. ఇంత తతంగం జరిగిన సంబంధిత పోలీసు అధికారులు గానీ,ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ అధికారులు గాని పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో బెల్ట్ షాపుల నిర్వహకుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది.

అమిత్ షా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి

వామపక్ష, ప్రజా సంఘాల డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్'ను అవమానించిన కేంద్ర హెూంమంత్రి అమిత్ షా గో బ్యాక్ అంటూ వామ పక్ష నేతలు నిరసన తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వస్తున్న అమిత్ షా గో బ్యాక్ అంటూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో జెండామాల్ జంక్షన్లో ఆదివారం రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఎం, సీపీఐ నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, బి.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాస్, కోట అప్పన్న లు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ ను అమిత్ షా అవమానించారన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసి అంబేద్కర్ ను అవమానించిన అమిత్ షా రాష్ట్ర పర్యటనను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అమిత్ షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు బహిరంగ క్షమావణ చెప్పాలని తరువాతే రాష్ట్ర పర్యటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి పశు ఆరోగ్య శిబిరాలు : పశువైద్యాధికారి గాయత్రి

విశాలాంధ్ర-లక్కవరపుకోట: ఈనెల 20 నుంచి 31 వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించ బడునని మండల పశువైద్యశాల వైద్యాధికారి కోరాడ గాయత్రి తెలిపారు. ఆదివారం ఆమె విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలుపుతూ పశువుల ఆరోగ్యానికి, ఉత్పాదకతను పెంచడానికి, వ్యాధులను నియంత్రించడానికి పశుపోషణ ఖర్చులు తగ్గించడానికి మరియు ఆర్థిక అండను కలగజేయడంలో భాగంగా పశుసంవర్ధక సేవలను పశుపోషకులకు మరింత చేరువ చేయడానికి ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ శిబిరాలలో పశు వైద్యులచే పరీక్షించి ఉచితంగా వైద్యం అందించబడును తేలికపాటి శస్త్ర చికిత్సలు ఎదకురాని, చూలు కట్టని ఇతర గర్భకోస వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగు వైద్యం అందించబడుతుందని ఆమె తెలిపారు. ఈ శిబిరాలు 12 రోజులపాటు రెండు బృందాలుగా ఏర్పడి తమతోపాటు బీమాలి పశువైద్యశాల అధికారి ఎస్ సత్యనారాయణ ఈ సేవలు అందిస్తారని తెలిపారు.

బస్సు ఢీకొని ఒక వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర-రామభద్రపురం : ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తికి గాయాలు అయ్యాయని స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ అప్పారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం విశాఖపట్నం శిలానగర్ కు చెందిన బొంకూర్ బాబ్జి రామభద్రపురం లో ఉన్న బంధువుల ఇంటికి సంక్రాంతి పండగ సందర్భంగా వచ్చాడు. ఆదివారం బొబ్బిలిలో ఉంటున్న బంధువుల ఇంటికి స్కూటీపై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాబ్జికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన బాబ్జిని ప్రాథమిక వైద్యం కొరకు 108 అంబులెన్స్ లో బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన అన్నారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా కోడి పందాలు

పట్టించుకోని పోలీసులు

విశాలాంధ్ర-వేపాడ : సంక్రాంతి పండగ తర్వాత గ్రామాల్లో నిర్వహిస్తున్న తీర్థ మహోత్సవాలను పురస్కరించుకొని పందెం రాయిల్లు బహిరంగంగానే కోడి పందాలను నిర్వహిస్తున్నారు.జూదం పేకాట కోడిపందాలు బల్లాటాలను నిర్వహించరాదని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ బహిరంగ ప్రకటనల ద్వారా ఆదేశాలు జారీ చేసినప్పటికీ స్థానిక పోలీసులు కాసులకు కక్కుర్తిపడి కోడిపందాల నిర్వహణకు సహకరించడంతో గ్రామాల్లో నాయకులకు ఎదురు లేదని భావిస్తూ తీర్థ మహోత్సవాల ప్రాంతాల్లోనే బహిరంగంగా కోడిపందాలు నిర్వహిస్తూ మాకు ఎదురు లేదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు.జిల్లా ఎస్పీ ఆదేశాలకు ఈ మండలంలో దిక్కు లేకుండా పోయిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఘనంగా చుక్కమాంబ తీర్థ మహోత్సవం

కడుపుబ్బ నవ్వించిన బాలనాగమ్మ బుర్రకథ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామం ఆరాధ్య దేవత శ్రీ చుకుమాంబ 79వ తీర్థ మహోత్సవం ఆదివారం గ్రామ సర్పంచ్ దుల్ల లక్ష్మీ సన్యాసిరావు,మాజీ సర్పంచ్ దంపతులు దుల్ల మంగమ్మ వెంకటరమణల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ తీర్థ మహోత్సవం సందర్భంగా అమ్మవారికి ఉదయం 6 గంటల నుండి దీవదూప నైవేద్యాలతో పాటు పసుపు కుంకుమలు అర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.మధ్యాహ్నం 4 గంటల నుండి ప్రదర్శించిన బాలనాగమ్మ బుర్రకథ గ్రామస్తులతో పాటు బంధుమిత్రులను కడుపుబ్బ నవ్వించారు.అలాగే రాత్రి 9 గంటల నుండి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ఆకట్టుకుంది.ఈ కార్యక్రమం ఎంపీటీసీ తొండవరపు వెంకటరమణ,గ్రామ పెద్దలు దుల్ల నాయుడు బాబు, సన్యాసిరావు గ్రామస్తులు, యువకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖ గ్రంథాలయం లో ఆదివారం చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకువాలి అని స్థానిక గ్రంథాలయ అధికారి సి. హెచ్. కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయం లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించడం అయింది. పిల్లల తో కథలు పుస్తకాలు, పురాణ ఇతిహాసాలు గ్రంథాలయం లో ముఖ్య అంశాలను చదివించడం జరిగింది. చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

త్యాగయ్య వేషధారణలో అలరించిన మోడేకూర్తి వెంకట కామేశ్వరరావు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, విజయనగరం 689వ కార్యక్రమం సద్గురు త్యాగరాజస్వామి 178వ ఆరాధన ఆదిభట్ల నారాయణదాసు 80వ స్మరనోత్సవం రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ సంయుక్తంగా కొత్తపేట మండపం వద్ద గల సంస్థ కార్యాలయం ఆర్యసోమయాజుల కాశీ పతిరావు స్మారక భవనంలో ఉదయం నుండి రాత్రి వరకు నిర్వహించారు. ముందుగా శ్రీ పైడితల్లి అమ్మవారి కోవెల నుండి అంబటి సత్రం మీదుగా వేదికవద్దకు త్యాగరాజ, నారాయణదాసుల చిత్రపటాలతో జమ్ము అప్పన్న బృందం నాదస్వరం ప్రఖ్యాత సీనియర్ వేణుగాన విద్వాంసులు మోడెకుర్తి వెంకట కామేశ్వర రావు త్యాగరాజ ప్రత్యేక వేషధారణతో తిరువీధి ఉత్సవం జరిగింది. అనంతరం శ్రీరామసేవాసమితి వారు గతంలో సమర్పించిన త్యాగరాజ ఉత్సవ మూర్తికి మంగిపూడి శంకర్ శర్మ అర్చకత్వంలో పంచామృత అభిషేకం పూజాకార్యక్రమాలతో ఘనరాగ పంచరత్న కృతులలో గాన నీరాజనం విశేషంగా జరిగింది. ఇందులో భాగవతుల వంశీకృష్ణ, నిరుపమ, కరుణ, మేడూరి లక్ష్మి, రాఘవన్ తిరుమల శారదాద్వయం, సుభద్ర,అనన్య డాక్టర్ మండపాక రవి, సునీత తదితరులు కచేరీలు చేయగా వీరికి వయొలిన్ పై నీలాద్రి, రామచరణ్, భానూహర్ష, మృదంగం పై వి.అప్పలస్వామి, ఏదు కొండలు, మహేశ్వర రావు, శివకుమార్, కామేశ్వరరావు లను,శ్రీనివాస్,వంగల ఆచారి, సుధాకర్ లు సంస్థ అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, ,కోశాధికారి దన్నాద సుధాకర్, డాక్టర్ కె.ఎ.పద్మప్రియ, కామే శ్వరరావు పంచరత్నాల్లో పాల్గొన్న విద్వాం సులను సత్కరించారు. సాయంత్రం ప్రముఖ విద్వాంసులు పి.చిన్న గాత్ర కచేరీ సంగీతా భిమాను అలరించింది. మహదాసు శ్యామ్ నీలాద్రి వయొలిన్ డాక్టర్ మండపాక రవి మృదంగంపై ధీటుగా సహకరించారు. సంస్థ అధ్యక్షులు సర్వేశ్వర రావు, డాక్టర్ ఎ. గోపాలరావు, పద్మప్రియ, భాస్కర రావు, సునీత, భానుమతి, పద్మావతీ శారద, సుధాకర్, కాంభట్ల శ్రీధర్ ఇతర సభ్యులు సంగీతాభిమా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పరుగులు పెడుతున్న రామభద్రపురం...

సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు

విశాలాంధ్ర-రామభద్రపురం: రామభద్రపురం మేజర్ పంచాయతీ అన్ని విధాలుగా అభివృద్ధిలో దూసుకుపోతుందని సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి, ఉప సర్పంచ్ చింతల అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ వద్ద మాట్లాడారు. గ్రామాన్ని అన్ని రకాలుగా ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ మధ్యకాలంలో గ్రామాన్ని దాదాపుగా ఒక కోటి 20 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా మంచినీరుకోలాయిలు, సిమెంట్ కాలువలు, సిమెంటు రహదారులు నిర్మించారు. ఎమ్మెల్యే బేబీ నాయనా సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఉప సర్పంచ్ రామకృష్ణ తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా రామభద్రపురం అభివృద్ధికి నోచుకోలేదని అందుకే గ్రామం పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన ఉన్న కూరగాయల మార్కెట్ ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తే వివిధ గ్రామాల నుంచి వచ్చే రైతులు కూరగాయలను తీసుకుని వచ్చి చక్కగా అమ్ముకొని వచ్చిన అన్నారు. ప్రాథమికంగా మొదటి దశలో 25 లక్షల రూపాయలు పంచాయతీ నిధులను వెచ్చించి మార్కెట్ అంతా ఫ్లాట్ ఫారం నిర్మించడం జరిగిందని తెలిపారు.రెండో దశలో వ్యాపారస్తులకు షెడ్ లు నిర్మించడం జరుగుతుందని అన్నారు. ఈ మార్కెట్ రెండు మూడు రాష్ట్రాల నుంచి వ్యాపారస్తులు వచ్చి పెద్ద మొత్తంలో ఎక్కడి నుంచి కూరగాయలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే గ్రామంలో నిత్యం ఏ చిన్న సమస్య వచ్చినా పాలకవర్గం స్పందిస్తూ సమస్యను పరిష్కరించిన జరుగుతుందని అన్నారు. అన్ని విధాలుగా గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ కర్తవ్యం అని అన్నారు.

వేమన పద్యాల ద్వారా ప్రపంచానికి ఆధ్యాత్మిక జ్ఞానం..

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: ఆధ్యాత్మిక కవి శ్రీ వేమన భగవాన్ తన పద్యాలు ద్వారా యావత్తు ప్రపంచానికి ఆధ్యాత్మిక జ్ఞానం తెలియజేసారని విజయనగరం శాసనసభ్యులు పూసపాటి అతిథి విజయగజపతిరాజు అన్నారు. ప్రబోధసేవా సమితి,ఇందూ జ్ఞానవేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వానపల్లి శంకరరావు అధ్వర్యంలో ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో వేమన జయంతి వేడుకలు ఆదివారం విజయనగరం టీటీడీ భవనంలో ఘనంగా జరిగాయి.. ఈ మేరకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.. అనంతరం వేమన ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు..ఈ మేరకు ఆమె మాట్లాడుతూ వేమన సాధారణ వ్యక్తి కాదని సాక్షాత్తు భగవాన్ స్వరూపమని అన్నారు. ఆయన పద్యాల ద్వారా ఎంతో ఆధ్యాత్మికత జ్ఞానాన్ని ప్రజలకు తెలియజేశారు.. జీవాత్మ ఆత్మ పరమాత్మ విధానాన్ని ఆయన తన రచనల ద్వారా తెలియజేశారు... అనంతరం సమితి ప్రతినిధులు వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం వేమన ప్రతిమను విజయనగరం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు..ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ రాజు. తూర్పు కాపు సంక్షేమ సంఘం చైర్ పర్సన్ పాలవలస యశస్విని, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసల నాయుడు, రాష్ట్ర బాలల హక్కుల చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు, బాలల న్యాయమండలి సభ్యులు కరణం జనార్దన్రావు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామానందం, జాతీయ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు బాల బ్రహ్మారెడ్డి, రాష్ట్ర జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉత్తరాంధ్ర ప్రబోధా సేవాసమితి ప్రతినిదులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-వేపాడ : ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిసాము చదువుల చెట్టు నీడలో అంటూ శ్రీ వివేకానంద విద్యాసంస్థ విద్యార్థులు ఇంటర్, డిగ్రీ 2009-2014 బ్యాచ్‌కు చెందిన అలనాటి విద్యార్థులు ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ముందుగా కళాశాల కరస్పాండెంట్ సిహెచ్ ఆర్ కే ప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. పలు ప్రాంతాల నుండి స్థిరపడిన వారంతా ఒకేచోటకు చేరుకొని అప్యాయంగా పలకరించుకున్నారు.సభలో ఒకరినొకరు ఆలింగనం చేసుకొని నిక్‌నేమ్‌లతో పిలుచుకున్నారు.తీపి జ్ఞాపకలను గుర్తు చేసుకొంటూ యోగ క్షేమాలనులను గురించి వివరించు కున్నారు.పాఠాలను నేర్పించిన ఉపాధ్యాయులను సత్కరించారు.15 ఏళ్ల నాటి విద్యార్థులను చూసిన ఉపాధ్యాయులు తన్మయత్వంతో మునిగిపోయారు. అనంతరం పూర్వ విద్యార్థులు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందరికీ పరిచయం చేశారు.వివిధ హోదాల్లో పూర్వ విద్యార్థులు ఉన్నారని,ఇంకా మరిన్ని విజయాలు సాధించాలని ఉపాధ్యాయులు కోరారు. విద్యార్థులకు చదువు అప్పటి గురువులను దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.